—జలంధర

వర్షం... ధారాపాతంగా కుంభవృష్టిగా కురుస్తోంది వర్షం... నన్నటి చినుకు ధారలపై అప్పుడప్పుడు మెరుపు తుంపరలు పడి, వక్రీభవించి వెండి చినుకులు పడుతున్నాయా అన్నట్లుంది చీకట్లో వర్షం.

అద్దాల కిటికీల్లోంచి ఇంతింత కళ్లతో బైట వర్షాన్ని చూస్తోంది శ్రీదేవి. ముచ్చటగా ముడుచుకున్న ముంగాళ్లకు కొత్త వెండి పాంజేబు పట్టాలు, శంఖు పూవుల్లా ఉన్న మట్టెలు, పారాణి వేళ్ల మీద చీకటిలో పడే కవ్వొత్తి వెలుతురికి వక్రీభవించి, విచిత్రమైన అందంతో మెరుస్తున్నాయి.

కట్టుకున్న పట్టుచీర... చల్లచల్లగా, వెచ్చవెచ్చగా తమాషాగా వుంది... మెల్లగా లేచి తన కిష్టమైన చిన్నబాల్కనీలోకి వచ్చి చుట్టూ చూసింది... చీకట్లో వర్షం... మెరుపులు... ఎందుకో భలే థ్రిల్లింగ్‌గా ఉన్నదామెకు... చెయ్యి చాచింది వర్షంలోకి. మెహందీ పెట్టిన చేతుల మీదుగా, కొత్త పెళ్లికూతురు రంగుల గాజుల మీదుగా వర్షం... గాజులు కొత్త రకంగా... అదొక రకంగా మోగాయి. చిలిపిగా చేతులు అటూ ఇటూ తిప్పింది... పెట్టుకున్న డైమెండ్ ఉంగరం తళుక్కుమన్నది.

ఆమె కొత్త పెళ్లి కూతురు శ్రీదేవి... బారెడు జడ, బంగారు చామంతి పూవులు... తల్లో మల్లెపూవుల మత్తు... భారంగా, దిగులుగా... మెల్లగా జడ కుప్పెలు విప్పి, పాయపాయలుగా... ఆలోచనల చిక్కుముడి విప్పుతున్నట్లు... ఆలోచిస్తూ విప్పుతోంది.

శ్రీదేవి పోస్ట్‌గ్రాడ్యుయేట్... కమీషన్ వ్యాపారస్థుడు రామనాథంగారి ఏకైక కుమార్తె... పదేళ్లల్లో దాదాపు అర కోటి రూపాయల ఆస్థి నంపాదించిన ఆయన కూతురు శ్రీదేవికి భోగాలు కాలికింద మెత్తటి ఖరీదైన కార్పెట్‌లా, వేసవికాలంలో ఏసీలా- అలవాటైపోయాయి. అటువంటి ఆమెకు ఆశ్చర్యకరంగా, పెళ్లైన వారంలో చాలా విషయాలు, ఇంతకు ముందు ఆలోచించనివి చాలా వంచలనాన్ని కలిగిస్తున్నాయి... అవి, అత్తగారు, ఆడబడుచులులాంటి మామూలు నమస్యలు కావు... 'అమ్మ'—ఆమె అంటే ఏమిటో అని ఎప్పుడూ ఆలోచించని శ్రీదేవి ఇప్పుడు ఆలోచిస్తోంది.

మౌనంగా, బిత్తర చూపులు చూస్తూ మాట్లాడే ఆమె తల్లి ఆంధ్రదేశంలో ఒక చిన్న టౌన్‌లో మూడు గదుల ఇంటి కాపురంలో అడుగు పెట్టిన సామాన్యమైన ఇల్లాలు. "కిరననాయలు రాదు, కూరలు మండిపోతున్నాయ"ని తిట్టుకుంటూ, కురుస్తున్న వంటింట్లోనే, మరుదు

'వ్యక్తికీ, నమాజానికీ మధ్య ఎలాంటి అనుబంధం వుంది? అది ఎలా వుండాలి?' ఈ ప్రశ్నలకు జవాబులు వ్యక్తుల నంస్కారంపై ఆధారపడి వుంటాయి. తన బాధ ప్రపంచానికి బాధ అనుకునే వారు కొందరుంటే, ప్రపంచపు బాధ అంతా తనదేనని భావించేవారు మరికొందరుంటారు!

లకు, భర్తకు ఇష్టమని వేడి వేడి బజ్జీలు వేసిపెడుతూ, అత్తగారు కేకలేసినప్పుడల్లా "నా బ్రతుకింతే, హాయిగా బతికే ప్రాప్తం లేదు" అని గుడ్ల నీరు కుక్కుకుంటూ, పండక్కి కట్టుకునే కొత్త జరీచీరే పెద్ద విలాసంగా బతికేది ఆమె ఒకప్పుడు. శ్రావణ శుక్రవారం సాయంత్రం కాళ్ల నిండా పసుపు రాసుకుని, జరీచీర కట్టుకుని, కళ్ల కాటికతో, తలనిండా పూవులతో ఎప్పుడూ దొరకదని తెలిసిన ఏదో హాయిని గురించి ఆలోచిస్తూ ఒక్కసారన్నా చీర బావుంది అని భర్త అంటాడేమో, తను ఆ చీర ఎంత పొదుపు చేసుకుని కొనుక్కుందో చెబుదామని కాటుక కళ్లతో, ఓర చూపులు చూస్తూ గడిపేది.

"రాజేశ్వరీ! ఏనిమిదైంది... కొత్త చీర మార్చుకుని వచ్చి అన్నాలు వడ్డించు..." అని అత్తగారు కేకబెట్టగానే, ఉస్సురని, పాత చీర మార్చుకుని, కుచ్చెళ్లు నడుముకు చెక్కి పనిలో పడిపోయేది. అలా ఆ ఇల్లాలు ఎప్పుడూ ఎదుటివారి ప్రశ్నకు జవాబుగా, భర్త కోరికలకు ఆస్వాద నగా బతికేసింది.

కానీ ఇప్పుడో... "గవర్నరొస్తున్నారు ఆ ఫంక్షనుకు... ఏమిటా అవతారం... మంచి చీరకట్టుకో...." అనే భర్తను మామూలుగా చూస్తుంది ఆమె.

"అకారణంగా మీకు డబ్బు వచ్చింది..." అను కుంటుంది పాపం—అప్పుడప్పుడు.

ఒక జత స్టీలు కంచాలు కొనడానికి ఎంచి, పావు వాడి దుంపతెంపి, రకరకాలుగా తర్జన భర్జనలతో రెండు రూపాయలు తగ్గించి, ఆ బేరం, తన లాభం నలుగురికీ చెప్పుకుని ఆనందించే ఆ ఇల్లాలికి ఒక్కసారిగా జీవితంలో మార్పు వచ్చి, భర్త పెద్ద బిజినెస్ మాగ్నెట్ అయి, సెట్‌లో రెండు ప్లేట్లు పగిలిపోతే, డిన్నరు సెట్ మొత్తం మార్చేసే ప్రయత్నాలు, చావ కొనుక్కోవడానికి ఆలోచించే జీవితంలోకి కార్పెట్ క్లీనర్లు ప్రవేశించి, ఆవిడను బొత్తిగా సామాన్య స్త్రీ జీవితానికి దూరం చేశాయి.

వర్షం వచ్చినప్పుడు ఒళ్లంతా దుప్పటి కప్పుకుని, గువ్వపిట్టలా ఒదిగిపోయి కూర్చుని, తప్పాలారొట్టెలో ఆవకాయ, నెయ్యి వేసుకుని "ఎంత బావుందో" అంటూ తినే కూతురు, బ్రెడ్, శాండివిచ్చెస్, సలాడ్స్ అని మాట్లాడుతూ ఎదుగుతూ తనకు దూరమైపో తూంటే, మామూలుగా ఇంతింత కళ్లతో చూడటం తప్ప ఏం చెయ్యలేకపోయేది ఆమె.

జీవితంలో వస్తు సమృద్ధిగా ఉండటం అసలు పెద్ద పెలితేమో... ఆలోచించడానికి, బాధపడటానికి మనిషికి వచ్చే చిన్న చిన్న కష్టాలు, బుల్లి బుల్లి బాధలు, నరాల్లో ప్రకంపన కలిగించి, రక్తం వేడెక్కించి బ్రతకాలనే జీవం పోస్తాయేమో... అని భర్త లెఖ్ఖ ప్రకారం 'ఏ పనికిరాని భావుకుడో చెపితే, అదంతా నాకు తెలియదు అనే స్తుందేమో కానీ, 'అవునేమో' అని ఆలోచిస్తుంది కూడా.

అందుకే ఆవిడ శ్రీదేవి పెళ్లి ఫారిన్ రిటర్న్‌డ్ డాక్టరుతో కుదిరి, మంది మార్బలం ఇల్లాంటివన్నీ అతనికి అతి సామాన్య విషయాలని విన్నప్పుడు ఆకాశ మంత పందిరి, భూదేవంత అరుగు అన్నట్లు పెళ్లి జరిగినప్పుడు కూడా ఏం మాట్లాడలేదు కానీ, పెళ్లి పేరుతో షాంపైన్ వరదలై పారినప్పుడు, దూరపు బంధువు ఒక కుర్రవాడు మధ్య తరగతి వాడు పాపం షాంపైన్ బాటిల్‌కు కక్కుర్తి పడి దాచబోతూంటే, మరిది చేతుల్లో దెబ్బలు తినడం విన్నప్పుడు మాత్రం—

"మామూలుగా సుఖంగా హాయిగా బతికే వాళ్లంతా మనల్ని చూసి చెడిపోతున్నారండీ! కేవలం ఖాళీ బాటిళ్లు అమ్ముకుంటే రెండు వేలు వచ్చేట్లున్నాయి? ఎందుకొచ్చిన హెూదాలివి?" అంది ధైర్యం చేసి భర్తతో...

"ఛీ! ఛీ! ఎదగని మనస్తత్వం నీది... పోయి ఆ రూమ్ క్లీన్ చేయించు... అల్లుడుగారు వచ్చేస్తున్నారు..." అని వినుక్కుంటున్న భర్తను మౌనంగా ఒక చూపు చూసి, ఒళ్లంతా కొంగు కప్పుకుని పనివాళ్లతో పైకి వెళ్లింది ఆమె.

"పొద్దుట నుంచీ ఉపోషం ఉంది, దైవిక మంత్రా లతో జరగవలసిన ఔపోసన కార్యక్రమం... ఏమిటే ఇది?!" అంటున్న అత్తగారి మాటలకు—

"సరే... అదెంత తంతో, ఇదీ అంతే తంతులే అత్తయ్యా! ఏదీ మనసుకు సంబంధించిన విషయం కాదుగా" అనేసి, చరచరా పైన ఉండే బెడ్‌రూమ్‌లోకి వెళ్లింది. అప్పటిదాకా ఆ గది పెళ్లి కొడుకు, అతని స్నేహ బృందం ఉపయోగించారు.

'ఎక్కడ చూసినా వెధవ వాసన' అని తిట్టుకుంటూ కార్పెట్ శుభ్రం చేయించి, బెడ్ షీట్లు మార్పించింది. కూతురు గురించి ఆలోచిస్తోంది ఆమె.

చదువుకున్నదే కాని దానికి ఇష్టాలంటే ఏమిటో తెలుసా? ప్రత్యేకతలంటే ఏమిటో తెలుసా?

వట్టి వేరు అత్తరు గదంతా స్ప్రే చేసింది. కట్‌గ్లాస్ ఫ్లవర్‌వాజ్‌లో రోజా పువ్వులు పెట్టింది.

తను కష్టపడి ఈ రోజుకోసరం అల్లిన ఎర్ర రోజా పూవుల దిండు గలేబులు తొడిగింది. దుప్పటి చుట్టూ రెడ్ హార్ట్స్ అల్లించింది. ఈ విద్యలన్నీ ప్రతి మధ్య తరగతి ఆడబడుచుకూ వచ్చు. వచ్చే అవకాశం ఉన్నది. కానీ, చిన్న చిన్న పనులతో సామాన్యమైన విషయాలను సౌందర్యవంతమైనవిగా ప్రత్యేకమైనవిగా మార్చగల ఓర్పు, నేర్పు చాలా తక్కువమందికి ఉంటుంది.

"మొఘల్ పాన పాత్రలా వుంది" అని ముచ్చటపడి కొన్న వెండి నగిషీ చేసిన కూజాలో వట్టి వేళ్లు, చందనం, యాలక్కాయలు కలిపిన నీరు పోసి వుంచింది.

గది అలంకరణ అంతా ముగించి, తిరిగి ఒకసారి చూసుకుని, మెట్లు దిగుతూ ఏ.సి.రూములో ఫ్రెండ్స్‌తో కబుర్లు చెపుతున్న కూతుర్ని చూసి అప్రయత్నంగా "పిచ్చితల్లి" అనుకున్నది.

పిలవాలని, మాట్లాడాలని... ఏదో చెప్పాలని ఉన్నదా మెకు: కానీ... సందేహించింది ఆమె... "శ్రీదేవి చుట్టూ ప్రపంచమంతా మెకానికల్! ఏం చెప్పినా అర్థమౌ తుందా?!"

మెల్లిగా మెట్లు దిగుతూ వెండి ట్రేలో ఐస్ బాక్స్, సీసా చూసి ఉలిక్కిపడింది... అవి తను అలంకరించిన గదిలో ఎంత అర్థం లేకుండా ఉంటాయో అర్థం చేసుకుని ఆలోచించకూడదనుకుంటూ చరచర మెట్లు దిగిపోయింది.

మంచినూనెలో రవ్వంత కచ్చురాలు పచ్చ కర్పూరం వేసి తలంటి, పన్నీరుతో స్నానం చేయించి, చందనం, రోజా రేకులు, కస్తూరి, పసుపు కర్పూరం కలిపి తయారు చేయించిన సున్నిపిండితో నలుగు పెట్టి, జవ్వాది ఒంటికి రాసి, తెల్ల చీరతో, ముత్యాల జూకాలతో మల్లెపూ వులతో అలంకరించి కళ్లారా చూసుకుని, దృష్టి తగల కుండా అగరు చుక్క పెట్టి హారతిచ్చింది కూతురుకు:

"ఏమిటమ్మా ఇదంతా అమ్మవారిలా?" విసు క్కుంటూనే ఒప్పుకుంది శ్రీదేవి దీనికంతా... ఆమెకూ సరదాగానే వుంది. పైగా ఊహ తెలిసిన తరవాత అమ్మకింత టేస్ట్ ఉందని గ్రహించలేదామె. అందుకే ఆనాటి నుంచీ తల్లిని ఆశ్చర్యంగా గమనిస్తోంది:

ఇర్వింగ్ వాలెస్‌లు, షిడ్నీ షెల్డాన్‌లు, మైకేల్ జాక్స న్లు—వీళ్లంతా ఆడపిల్లలను వయస్సుకు మించి పెంచే స్తున్నారు. ఒకొక్కసారి వయస్సుకు మించిన ఉత్సాహం, ఉద్వేగం కూడా ఈ కాలం ఆడపిల్లలలో ప్రతిఫలిస్తోంది. అలా పెరిగిన అమ్మాయే శ్రీదేవి కూడా. ఆ ఉత్సాహానికి అందముంది, బాధ్యత లేదు మరి!

కానీ, ఆ రాత్రి...

"సారీ డార్లింగ్... అయాం డామ్ టైర్డ్..." అంటూ చెప్పగూడనివి కలవరిస్తూ రాత్రి ఒంటిగంట తరవాత తప్పతాగి, గదిలో అడుగు పెట్టి పక్కమీద ఒరిగిపోతున్న భర్తను చూస్తూ తన అలంకరణను ఒక్కసారి అద్దంలో చూసుకుని ఉలిక్కిపడింది శ్రీదేవి... ఆ గదిని అలంక రించిన పూవుల తోరణాల వెనకాల ఉండే ఒక పవిత్ర మూర్తి గుర్తుకు వచ్చి భయపడింది. "ఇదంతా అమ్మకు తెలియకుండా ఉంటే బాగుండును..." అనిపించింది ఆమెకు ఆ క్షణంలో...

అగరవత్తులు, చందనపు రూం స్ప్రే వాసనలతో పాటు మరొక ఘాటైన వాసనతో ఉక్కిరిబిక్కిరై ఏదో వెగటుతో గదినుంచి బయటపడి చల్లటి గాలి కోసం వరండాలోకి వచ్చింది శ్రీదేవి.

అక్కడ మెట్ల మీద ఒదిగి కూర్చున్న వ్యక్తిని చూసి ఉలిక్కిపడింది. రవ్వల ముక్కుపుడక చీకట్లో తళుక్కు మన్నది.

"అమ్మా!" అంటూ చాచిన చేతుల్లో ఒదిగిపోయింది. తల్లీ కూతుళ్ల మధ్య పెరిగి పోయిన ఇన్నేళ్ల దూరం ఒక్కసారిగా తరిగిపోయినట్లైంది.

ఇదే తల్లీ జీవితం... అంటోంది తల్లి స్పర్శ... కానీ... ఆ

కాస్సేపట్లో చాలా ఎదిగి పోయింది శ్రీదేవి

"అమ్మా! ఈ మాత్రం ఓదార్పు, అర్థమున్న ఓదార్పు, అనంతమైన అనుభూతితో కూడుకున్న సముద్రంల్లాంటి ఓదార్పు-ఈ కొంచెం ఉంటే చాలమ్మా బ్రతకడానికి.... ఈ మాత్రం లేకే హిస్టీరియా పేషెంట్లు అయిపోతున్నారు మనుష్యులు..." మనసులో అనుకుంటూ-అలాగే తల్లి ఒడిలో ఒదిగి పడుకుంది శ్రీదేవి.

* * *

కట్టలు తెగి ప్రవహిస్తోంది వర్షం... అమ్మ తృప్తికోసం పదహారు రోజుల పండగ దాకా అలాగే ఉంచుకుంటానన్నది అలంకారం... వెళ్లే చుట్టాలు, నిష్ఠూరాలు, పెట్టు పోతలు, హడావిడి తల్లి సతమతమై పోతోంది... దానికి తోడు ఈ వర్షం.

"తాజ్‌లో నా ఫ్రెండ్ దిగాడు... రేపు వెళ్లిపోతాడు. నువ్వు ఒద్దు ఆ వాతావరణంలోకి... ఓకే..." అని చెప్పి వెళ్లిన భర్త ఎప్పుడు వస్తాడో తెలియదు ఆమెకు.

నిట్టూర్చింది శ్రీదేవి. గత ఎనిమిది రోజులుగా ఈ తప్పనిసరి నిరీక్షణ, ప్రదానం నాడు తొడిగిన ఆరువేల రూపాయల రవ్వల ఉంగరం చేత్తో అతను పట్టుకునే వైన్ గ్లాసు—ఈ రెండూ ఆమె జీవితంలో తప్పని సరి భాగాలైపోయినాయి: కానీ, విచిత్రం, ఆమెకు అనుకున్నంత బాధగా లేదు... పెళ్లి అని తెలిసిన మూడు నెలల్లో ఆమె పెద్దగా ఆలోచించవలసిన అవసరం ఏర్పడలేదు. ఇది కాదు నాకు కావలసిన జీవితం... అని ఇప్పుడనిపిస్తోంది కానీ, అప్పుడు అనిపించలేదు.. కారణం?! అప్పుడు ఏం కావాలో, జీవితానికి విలువేమిటో అర్థం కాలేదు.

ఫ్రెండ్స్, ఎంజాయ్‌మెంట్స్—ఇవి తప్ప పెద్ద ఆలోచనలు లేవు ఆమెకు... ఎదిగి పోయాననుకున్న ఆమె ఏదైనా తట్టుకోగలను అనుకునేదేమో కూడా.

కానీ ఇప్పుడో?!

ఆలోచిస్తూ చీకట్లో వర్షపు ధారలు గుప్పెటతో పట్టుకోవాలని వృథా ప్రయత్నం చేస్తోంది శ్రీదేవి.

మెరుపులు... ఉరుములు... భయంకరమైన వర్షం...

ఉన్నట్టుండి... వర్షం ధారగా పడుతున్న ఆమె అల్లరి దోసిళ్లలోకి చటుక్కున కాంతి... ఉలిక్కిపడింది ఆమె. ఒళ్లు ఝల్లుమన్నది. ఒంటి నిండా నగలు... టైం పదకొండు దాటినట్లుంది.

"ఎవరది?" ఇంగ్లీషులో అరిచింది.

"నేనే!" ఆ ఆగంతకుడు దగ్గరైనాడు... ఆ వర్షపుధారల సడిలో ఆ గొంతు ఏమాత్రం పరిచితమైన దానిలా లేదు ఆమెకు.

"ఇంట్లో ఎవరూ లేరా?! మీ వాకిట్లో ఎలక్ట్రిక్ తీగ కొబ్బరి చెట్టు మీదుగా వాలింది... ప్రమాదం ముట్టుకుంటే... చెప్పిపోదామని వచ్చాను..." అతను అప్పుడు గుర్తు తెలిసాడు. మూడో ఇంట్లో శంకరం.

"ఎలా మరి?" కంగారుగా అన్నది.

"ఫరవాలేదు... చిన్న గేటు మూసెయ్యండి చాలు.... రేపు పొద్దున చూసుకోవచ్చు... అక్కడే పడింది..."

అతడు తోట నుంచి బాల్కనీ కొచ్చే మెట్ల మీద నిల్చున్నాడు. పరీక్ష ఫీజు కోసం అప్పుడప్పుడు టైపింగ్ వర్క్ చేసి, డబ్బు సంపాదించుకోడానికి ఇంటికి రెండు మూడు సార్లు వచ్చాడు.

'అతడు వర్షంలో తడుస్తున్నాడు పైకి రమ్మనాలా? వద్దా?' ఆలోచిస్తోంది ఆమె. 'తమ ఇంటి ముందు ప్రమాదం గురించి చెప్పడానికి అతడు తడుస్తూ వచ్చాడే... ఛీ! ఎలా ఆలోచిస్తున్నాను నేను...' తనను తాను మందలించుకుంది.

"పైకి రండి..." సందేహిస్తూ అన్నది.

ఆ వరండాలో, అన్ని మెరుపుల నగలతో అభిసారికలా అలంకరించుకున్న యవ్వనవంతురాలి పిలుపు అది. తలెత్తి చూశాడతను. వర్షంలో చినుకులు అతడి చెంపల మీదుగా జారుతున్నాయి. కళ్లు మాత్రం మెరుస్తున్నాయి. అతడు అయిష్టంగా వెనక్కు తిరగబోయాడు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భయంకర రూపం దాల్చింది వర్షం.

"అయ్యయ్యో... పెద్ద వర్షం... పైకి వచ్చేయ్యండి... సన్నగా అరిచింది ఆమె.

ఇంక లాభం లేదన్నట్లు పైకి వచ్చి, వరండాలో ఆమె పక్కన వచ్చి నిల్చున్నాడతను... ఒక్కసారిగా జల్లు ఫెళ్లున కొట్టింది.

"అయ్యయ్యో...." అంటూనే కిలకలా నవ్వింది శ్రీదేవి. చేతులు చాచి నీళ్లతో ఆడుకుంటోంది.

ఆమె తెలిసి చేస్తోందో, తెలియక చేస్తోందో కానీ, ఆ అల్లరి, ఆ ఒంటరితనం, ఆ అందం, ఆ వాతావరణం.. అతను ఆలోచించకుండా ఉండేటందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆకాశం వంక చూస్తున్నాడు. ఒక అడుగు వెనక్కు వేసి అతడినే పరీక్షగా చూస్తోంది శ్రీదేవి.

సామాన్యుడైన ఈ అందగాడు తనను తలవంచుకుని, ఏ మాత్రం కళ్లు ఎత్తకుండానే పరీక్షగా చూడటం తను మర్చిపోలేని అనుభూతి ఒకప్పుడు; కానీ, ఆ వయసులో ఆ పసి ఆరాధనలు, ఆమెకు తెలియనివి కావు; కాసేపు అల్లరి పెట్టి, కవ్వించి, ఆడించి ఏం తెలియనట్లు పెళ్లి కూతుళ్లైపోవడం అలవాటే ఆడపిల్లలకు; అంతస్తుల రీత్యా, ఇద్దరి మధ్యా హస్తిమశకాంతరమున్నది; కానీ,

ఈ ఒంటరితనంలో... ఇప్పుడు.

తమ దగ్గరతనం, అతని ఇబ్బంది... ఆమెకు మహా ఆటగా వుంది.

పెద్దగా మెరుపు మెరిసింది... ఎక్కడో పిడుగ [illegible] ట్లైంది.

"అమ్మో!" ఒక్క అరుపు అరిచింది శ్రీదేవి

రెండు బలమైన చేతులు ఆమెను గట్టిగా పట్టుకున్నాయి. అదీ కొన్ని క్షణాలు... అంతే... బిత్తర పోయి చూసింది శ్రీదేవి. ఒక్కసారి ఆమె కళ్లల్లోకి చూసి చటుక్కున వదిలేశాడు అతను.

"వస్తాను—కింద పనివాళ్లు కనిపించలేదు... నేనే చిన్న గేటు వేసిపోతాను...." చెప్తూ చరచర మెట్లు దిగి వెళ్లిపోయాడతను.

అటే చూస్తూ నిలబడింది శ్రీదేవి.

అతడు గేటు మూయడానికి తడుస్తూ చాలా ప్రయత్నం చేస్తున్నాడు. కానీ, ఎందుకో అది మూసుకోవడం లేదు.

'పనివాళ్లంతా ఏమయ్యారో...' అనుకుంటూ మెట్లు దిగి చరచర వెళ్లింది ఆమె.

మౌనంగా ఇద్దరూ కలిసి అతి ప్రయత్నం మీద గేటు వేశారు... గేటు జరవడంలో ఊపిరి బరువు... చుట్టూ వర్షపు జల్లుతో స్పందించే అర్థం లేని నిశ్శబ్దపు బరువు. అర్థం కాని పరిస్థితుల ఆలాపనలోని బరువు...

"అదుగో వైరు... జాగ్రత్త...." టార్చ్ వేసి వైరు చూపించాడు. ఆమె తలూపింది మౌనంగా...

"వస్తాను..."

"ఇంత వర్షంలో ఎక్కడికి?" ఆమె గొంతులో అతన్ని మరికాస్సేపు ఆపాలన్న ప్రయత్నం. ఈ కొద్ది క్షణాలు చాలా విలువలు మార్చాయి ఇద్దరి మధ్యా.

"లేదు వెళ్లాలి... అదుగో ఆ గుడిసెలు కొట్టుకుపోతున్నాయి... వీలైనంతమందిని ఆ స్కూలుకు చేర్చాలి..." చెప్తూ నీళ్లల్లోకి అడుగు వేశాడతను.

ఈ వర్షంలో... ఇతను... ఎదుటి వారి కోసం... ఏం వ్యక్తి?

"ఇంట్లో కంగారు పడరూ?" ఆ గొంతులో ఆప్యాయత.

నవ్వాడతను... లేని వెన్నెల విస్తరించినట్లైంది.

"మా ఇల్లు సగం కురుస్తోంది... ఏదో ఏర్పాటు చేసి వచ్చాను."

"మరి మీవాళ్ల గురించి ముందు ఆలోచించాలి కదా?..."

మళ్లీ నవ్వాడతను.

"శ్రీదేవిగారూ! ఒక విషయం తెలుసా... నిజమే... వర్షం బాధ అందరికీ సమానమే... మేమూ తప్పించుకోలేము. కానీ, రేపు మళ్లీ మాకు బ్రతుకున్నది. భయం లేదు. నష్టాన్ని కొంచెం కష్టపడ్డా పూడ్చుకోగలం. కానీ, ఆ గుడిసెల్లో వాళ్లకు జరిగేది?... అది నష్టం అనరు; సర్వనాశనం అంటారు.... కొన్ని జీవితాలు, ఎవరికీ విలువలేనివి, ఏ మనిషీ పట్టించుకోనివి ఇవ్వాళ సమూలంగా కొట్టుకుపోతాయి. తేరుకోలేరు... కాబట్టి రక్ష

ణ—వాళ్లకు కావాలి ఇప్పుడు. మనిషి బతకడం చాతకాక చచ్చిపోతే వాళ్లకు అసమర్థత అని వట్టం కట్టొచ్చు. కానీ, బ్రతకలేని పరిస్థితులు ఏర్పడితే?!... మనిషిగా ఊరుకోలేం కదూ... వస్తాను... పైకి వెళ్లండి... పోనీ, నేను వచ్చి దిగబెట్టనా?!" అతని వంకే చూస్తోంది శ్రీదేవి. రక్షణ... సమూలంగా కొట్టుకుపోతారు... తేరుకోలేరు... అంతే... అప్పుడు కావాలి ఆలంబన... ఆమె అతను తుపాను గురించి అన్న మాటలు, అర్థంలేని తన పెళ్లి గురించి అన్వయించుకుంటోంది ఆమె.

"నేనూ వస్తాను..." ఆవేశంగా గభాల్న గేటు తెరవబోయింది. "మీరా" గట్టిగా నవ్వాడతను. "ఇంకా నయం—ఇన్ని నగలతో, ఈ అలంకరణతో, మీలాంటి అందగత్తెను ఈ వర్షం రాత్రి వెంటబెట్టుకుని... బావుంది... థ్రిల్లింగ్‌గా ఉంది ఊహించడానికి... కానీ కొన్ని అదృష్టాలు ఊహలకే పరిమితం... చిన్నపిల్లలా మాట్లాడకండి... వెళ్లండి... నేనిక్కడే నిలబడి ఉంటాను... వెళ్లండి..." మరొకసారి కేకలేసినట్లు చెప్పాడతను.

మాట్లాడకుండా వెనక్కు తిరిగింది.

ఆమె వరండాలోకి వెళ్లేదాకా టార్చ్‌తో ఫాలో అయ్యాడతను. ఆ చీకట్లో కలిసిపోయాడు ఆ తరువాత.

అటే చూస్తూ నిలబడింది ఆమె... దూరంగా గుడిసెలు... సమూలంగా లేచిపోతున్నాయి నిజమే... కానీ, ఎంతమంది శంకరాలు ఈ ప్రళయాన్ని ఆపగలరు... ఆ ఆశోవహతులకు ఎంతని చెయ్యగలరు?! ఒక రకంగా అర్థం లేని జీవితమనే శూన్య సముద్రంలో చిక్కుకున్న నేనూ ఆశోవహతురాల్నే... కానీ, ఇది ఎవరూ రక్షించలేని పెనుతుపాను... భయంకరమైన ఉప్పెన.

'వాళ్లకు నేనేం చెయ్యలేనా?' కన్నీరు తుడుచుకుంటూ అనుకున్నది శ్రీదేవి. ఏం చెయ్యగలదు? ఈ రాజప్రాసాదం లాంటి ఇంట్లోకి దారిలేదు వాళ్లకు.

తన నగలు, అలంకరణ, అర్థంలేని ఈ నిరీక్షణ, రాగానే భర్త ఓపెన్ చెయ్యబోయే ఖరీదైన విదేశీ విస్కీ బాటిల్.

ఆమెలో ప్రళయం... ఏదో గర్జన... ఈ ఉప్పెన, ఆలోచనల తాకిడి... శూన్యంలోకి, వర్షంలోకి చూస్తూ అట్లాగే నిలబడిపోయింది ఆమె.

"అమ్మగారూ! లాంతరిదిగో..." పనివాడు వచ్చాడు.

"ఏమయ్యారు మీరంతా? చచ్చారా? ఆ శంకరంగారు వచ్చి వైరు పడిపోయిందని గేటు మూసి వెళ్లారు పాపం..." ప్రళయంలా విరుచుకుపడింది.

"కుక్కలు తడుస్తాయని, అయ్యగారు, కేకలేస్తారని వెనకాల అవుట్ హౌస్‌లో పెట్టడానికి వెళ్లానమ్మా... గేటు తాళం వేసి వస్తానుండండి... ఇంకా నయం... ఆ బాబు చెప్పారు" తడుస్తూ వెళుతున్న అతణ్ణే చూస్తోంది శ్రీదేవి.

కుక్కలు... మనుమలు... గుడిసెలు... శంకరం... ఈ వర్షం అందరికీ తలోరకంగా... తనకు ముఖ్యంగా మరొక రకంగా అనుభవాన్నిస్తోంది. దూరంగా తనకు తెలిసిన కారు హారన్.

భర్త వస్తున్నాడు... నిట్టూర్చి వెళ్లిపోయింది లోపలికి ఆమె.

* * *

ఆ మర్నాడు...

'వెధవ చెప్పులు... నూట యాభై పెట్టి కొన్నాను అప్పుడే నాశనం...' తిట్టుకుంటూ కారు దిగింది షాపింగ్ నుంచి వస్తూ శ్రీదేవి. వరండాలో హడావిడి చూసి చటుక్కున ఆగిపోయింది.

వరద బాధితులకు సహాయం అంటూ వచ్చి తండ్రితో మాట్లాడుతున్నారు కొంతమంది.

కానీ తండ్రి చాలా లౌక్యుడు... పేరు ప్రతిష్ఠలేని దానాలు చేసేటంతటి అమాయకుడు కాదు. ఇలా వసూలు చేసి ఎంత ఎంత అన్యాయాలు చేస్తున్నారో, బీదవాళ్లకు అందులో పదో వంతు కూడా ఎందుకు వెళ్లదో చెపుతున్నాడు వాళ్ల ఎదురుగుండానే... బిత్తరపోయి చూస్తున్నారు వాళ్లు.

వాళ్లలో శంకరం... స్థంభానికానుకుని, చేతులు కట్టుకుని, ఆలోచిస్తూ...

ఒక్క క్షణం ఆలోచించుకుని, చరచరా వెళ్లి—

"హల్లో! శంకరంగారా! నాన్నా... వీరే ఆ రోజు వైరు పడిపోయిందని చెప్పారు... లేకపోతే ఎంత ప్రమాదం జరిగిపోయేది—మీ అల్లుడు ఆ దారే వస్తారు అసలు..." గబగబ ఏదేదో మాట్లాడేస్తోంది శ్రీదేవి.

ఒక్కొక్క అక్షరంతో, ఒక్కొక్క రూపాయి కమిట్‌మెంటు తండ్రికి పెంచుతున్నానని ఆమెకు తెలుసు.

"నాన్నగారికి ఇల్లాంటి చందాలంటే ముందే ముందు నిలబడతారు..." భర్తకు చెప్పింది.

తప్పనిసరి పరిస్థితుల్లో, చాలా పెద్ద మొత్తం చెక్కుగా ఇచ్చాడు తండ్రి.

'చాలా థాంక్స్...' అంటూ వెళ్లిపోతున్న వాళ్ల వంక చాలా మామూలుగా చూసింది శ్రీదేవి... గేటు మూస్తూ తలెత్తి సూటిగా చూశాడు శంకరం.

ఒక్కసారిగా చటుక్కున తలెత్తి చూసి, లోపలికి వెళ్లిపోయింది ఆమె.

'ఇంతకన్నా నేనేం చెయ్యగలను?' మెల్లిగా వచ్చి తన కిష్టమైన వరండాలో నిలబడి చూస్తోంది ఆమె వెళ్లే వారి వంక.

ఒళ్లంతా కొంగు కప్పుకుని, చేతిలో బట్టల మూట, ఏవేవో సామాన్లు శంకరం చేతిలో పెట్టి చరచరా అడుగులు వేసి, ఏమి తెలియనట్లు వస్తోంది ఒక స్త్రీ మూర్తి. మెట్లెక్కగానే,

"అమ్మా!" అన్నది శ్రీదేవి. ఆశ్చర్యం, అనురాగం ఆమె గొంతులో.

"ఉష్... గట్టిగా మాట్లాడకు... మనింట్లో ఖాళీ విస్కీ బాటిళ్లు అమ్మితే రెండు గుడిసెలు లేస్తాయి... నువ్వు వదిలేసి అత్తగారింటికెళ్తూ నన్న బట్టలు కొన్ని వాళ్లకి ఇచ్చి వచ్చాను..." తల తుడుచుకుంటూ అన్నదామె... "అందులో ఒక పిల్ల బాలింతరాలు కూడా పాపం...."

"నాన్న డబ్బిచ్చారమ్మా!... నువ్వు ఇలా వెళితే... వాళ్లు రేపు నిన్ను ప్రతిదానికీ ఉపయోగించుకుంటారమ్మా!" తండ్రి లౌక్యం పుణికి పుచ్చుకున్న కూతుర్ని పరీక్షగా చూసింది రాజేశ్వరి.

"డబ్బు... అది ఎన్నో చేతులు మారి దాని విలువ పోగొట్టుకుంటుందమ్మా. నీ చేత్తో, నువ్వు మనస్ఫూర్తిగా చేసేదాని విలువ వేరు... నువ్వు నాలుగు వందల చీర కట్టుకోగలిగే, నువ్వు విడిచేసిన చీర ఇచ్చి దానం చేశాననుకోవడం ఆత్మవంచన... అది మంచిది కాదు తల్లీ! మరొకళ్ల గురించి ఆలోచించడం నీ కర్తవ్యం. అది నీ గొప్పతనమనుకుని ఆనందించకమ్మా!" తీక్షణంగా చిక్కుతీసుకుంటూ తల్లి అన్న మాటలు ఆమెను కొన్ని క్షణాలు నిలబెట్టాయి.

"కానీ మన మిచ్చేది మనకు తక్కువే గానీ, వాళ్లకు ఎక్కువేగా అమ్మా!"

తిరిగి చూసింది తల్లి... "నిజమే...దాని వల్ల వాళ్లకు జరిగేది ఎక్కువేమో... కానీ, మిగతావారిలో ఉండవలసిన మానవత్వం లేకపోవడం, ఏ కొద్దిపాలో మనలో ఉండటం మన ప్రత్యేకత అనే ఆత్మవంచనకు దిగకూడదుగా శ్రీ... అప్పుడు వాళ్లది ఆర్థిక దారిద్ర్యమైతే, మనది మానసిక దారిద్ర్యం... సుఖం, శాంతి నటిస్తూ బ్రతికేస్తున్నాం మనం... ఇల్లాంటి మనసుకు సంబంధించిన కొన్ని పనులన్నా నేర్చుకుంటేనే కానీ, ఒక్క రోజన్నా మనశ్శాంతిగా బ్రతకలేమేమో..."

నా ఇల్లు తడవడం లేదని కాదు.... అవతలి గుడిసెల్లో జీవితాలు సమూలంగా నాశనమైపోతాయి... అన్న శంకరం గుర్తుకు వచ్చాడు శ్రీదేవికి.

కొన్ని వందల పుస్తకాలు, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిగ్రీ, బ్రతికేసిన 23 ఏళ్ల జీవితంలో అనుభవాలు—ఇవేవీ చెప్పలేనివి ఒకరకంగా శంకరం, మరొక రకంగా అమ్మ చెప్పారు ఆమెకు.

వందమంది చెప్పలేని ఒక జీవన సత్యం, ఒక ఫలాపేక్షలేని మంచిపని, ఒక స్వచ్ఛమైన భావన చెప్పగలదా?!

ఆలోచిస్తోంది శ్రీదేవి...

ఆమెకు జవాబు జీవితమే చెప్పాలి! □